
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 20 జూలై 2024



నేడు విద్యా సంస్థలకు సెలవు

తుఫాన్ ప్రభావంతో శనివారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నట్టు వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు సెలవు ఇస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.



ఎల్.ఎన్.పేట: దబ్బపాడు గ్రామ సమీపంలో నీటమునిగిన పంట పొలాలు

● తక్షణ
సేవలకు అధికారుల కేటాయింపు

భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజలకు తక్షణ సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో పౌరసరఫరా శాఖకు చెందిన ఏడుగురు సిబ్బందిని నియమిస్తూ ఉత్తర్వులను జారీచేసింది. జిల్లా అంతటా నిత్యావసర సరుకుల్లో సరఫరాకు అంతరాయం కలగకుండా ఈ అధికారులకు ప్రత్యేకంగా విధులను అప్పగించింది. ప్రజలు కూడా ఈ అధికారులకు సమస్యలను తెలియజేయవచ్చు.

అధికారి పేరు	హోదా	ఫోన్ నంబర్
ఎస్.శ్రీనివాసరావు	టెక్నికల్ సపోర్ట్	97016 01416
ఎస్.శ్రీధర్	డిప్యూటీ తహసీల్దార్	94411 80262
జి.జాషువా	డిప్యూటీ తహసీల్దార్	83095 88458
బి.అనంత్‌కుమార్	టెక్నికల్ సపోర్ట్	93929 04772
వై.అరుణకుమారి	డిప్యూటీ తహసీల్దార్	95505 21691
కె.సంతోష్ కుమార్	డిప్యూటీ తహసీల్దార్	83329 78443
ఎంఎస్.దీపిక	సీనియర్ అసిస్టెంట్	94918 16542

సిక్కోలులో తుఫాన్



పలాసరూరల్: కేదారిపురం వద్ద వరహాలగెడ్డ ఉధృతి



పలాస: కాశీబుగ్గ-అక్కుపల్లి రోడ్డులో వర్షపునీరు

- జిల్లాఅంతటా విస్తారంగా వర్షాలు
- నేడు కూడా భారీవర్షాలు కురిసే చాన్స్
- ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారడంతో జిల్లా అంతటా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే రెండురోజుల నుంచి ఎడతెరిపి లేకుండా విస్తారంగా వర్షాలు కురవగా.. శనివారం కూడా భారీవర్షం కురిసే అవకాశముందని జిల్లా అధికార యంత్రాంగం ప్రకటించింది. శుక్రవారం వేకువజాము నుంచి వర్షం కురుస్తూనే ఉండడంతో జిల్లాలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. రాత్రి 10గంటల సమయానికి జిల్లాలో అత్యధికంగా శ్రీకాకుళంలో 84.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాంప్లెక్స్ ఆవరణ జలమయమైంది. నగరంలో ఎక్కడ చూసినా రోడ్లపై వరదనీరు ప్రవహించింది. చెరువులు, పంట పొలాలు నీటితో నిండిపోయాయి. సాగునీటి కాలువల్లో.. ఇటు ప్రాజెక్టుల నుంచి.. ఆపై వర్షపునీరు కలసి గట్లపై నుంచి జలకళ ప్రవహిస్తోంది. గత ప్రభుత్వం రోడ్లకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో మరింత ఛిద్రంగా మారాయి.

శుక్రవారం నమోదైన వర్షపాతం(మి.మీటర్లలో)	
శ్రీకాకుళం	84.5
హిరమండలం	70.0
ఆమదాలవలస	56.0
ఎచ్చెర్ల	51.75
రణస్థలం	43.75
సంతబొమ్మాళి	40.5
పలాస	37.5
నందిగాం	34.5
కవిటి	21.0

● ప్రజలకు ఇబ్బందులు లేకుండా..

భారీవర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని, సిబ్బందికి సెలవులు రద్దు చేయాలని తెలిపారు. 'జిల్లాలో నదులు, కాలువలు, బ్యారేజీలు, చెరువులు, తుఫాన్ కేంద్రాలను రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులు కలిసి పరిశీలించాలి. ఎక్కడైనా పాడైతే మరమ్మతులకు తక్షణ చర్యలు చేపట్టాలి. లోతట్టు ప్రాంతాలపై అప్రమత్తంగా ఉండాలి. రోడ్డు ప్రమాద ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి' అని కలెక్టర్ ఆదేశించారు. జేసీ నవీన్ మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో అంతరాయం.. చెట్లు కూలితే తీసుకోవాల్సిన చర్యలు.. తాగునీటికి అవరోధం ఏర్పడితే చేపట్టాల్సిన చర్యలను వివరించారు. డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 32 తుఫాన్ కేంద్రాల భవనాలు ఉండగా.. ఇందులో 9 మాత్రమే ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. వంశధార ఎస్ఈ రాంబాబు మాట్లాడుతూ వంశధారలోకి 1900 క్యూసెక్కుల నీరు వచ్చిందన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ మాట్లాడుతూ భారీవర్షాలకు కార్యదర్శులను అప్రమత్తం చేశామని... ట్యాంకులను క్లోరినేషన్ చేశామని తెలిపారు. సమావేశంలో శ్రీకాకుళం, పలాస ఆర్డీవోలు రంగయ్య, భరత్‌నాయక్, టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్, డీఆర్వో గణపతిరావు, జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, సీపీఓ లక్ష్మీ ప్రసన్న, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పాల్గొన్నారు.



శాకంబరిదేవిగా కనకదుర్గమ్మ

ఆషాడమాసం సందర్భంగా ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శ్రీకాకుళం ఏడురోడ్ల జంక్షన్ వద్ద కనకదుర్గమ్మను శాకంబరిదేవిగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అలాగే బొందిలీపురంలోని షిర్డీసాయి ఆలయం సామూహిక సహస్ర కుంకుమ పూజలు నిర్వహించారు. పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత, పీఎన్ కాలనీలో దుర్గాదేవి ఆలయాల్లో పూజలు చేశారు.

- శ్రీకాకుళం కల్చరల్



జిల్లా ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ఉద్యోగుల నిరసన

సమస్యలు పరిష్కరించాలి

- పోస్టల్ ఉద్యోగుల సంఘం డిమాండ్

అరసవల్లి, జూలై 19: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని పోస్టల్ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. జూన్‌లో న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో.. డిమాండ్ల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఉద్యోగుల సమాఖ్య నిర్ణయించిందని పోస్టల్ ఉద్యోగుల సంఘం నాయకులు గణపతి, బాబూరావు, యూవీ రమణ, చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు వారు శ్రీకాకుళం ప్రధాన తపాలా కార్యాలయం వద్ద శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన చేపటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ '8వ వేతన సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి. ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి. పెండింగ్‌లో ఉన్న 18 నెలల డీఏను విడుదల చేయాలి. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. ఖాళీగా ఉన్న అన్ని కేడర్ పోస్టులను భర్తీ చేయాలి. అసోసియేషన్లకు గుర్తింపు మంజూరు చేయాల'ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు, పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల, జూలై 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ బీఈడీ కళాశాలల విద్యార్థుల మొదటి సెమిస్టర్ పరీక్షలు జిల్లాలోని 6 కేంద్రాల్లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది నుంచి 12గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు 1,220 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలు 25 వరకు జరుగుతాయి. కాగా, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 30వ తేదీన ప్రారంభమవుతాయి.

నదుల అనుసంధానమే లక్ష్యం

- పూర్తిస్థాయిలో సాగు.. తాగునీరందిస్తాం
- వైసీపీ నిర్లక్ష్యంతో నిలిచిన 'జల్‌జీవన్'
- పనులు పూర్తికాకుండానే అప్పట్లో ప్రారంభం
- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ఇచ్ఛాపురం, జూలై 19: 'జిల్లాలో వంశధార, నాగావళి, బాహుదా నదుల అనుసంధానానికి కృషి చేస్తాం. ప్రజలకు పూర్తిస్థాయిలో సాగు, తాగునీరందిస్తా'మని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. కేంద్రమంత్రి హోదాలో తొలిసారిగా ఆయన ఇచ్ఛాపురంలో పర్యటించారు. ముందుగా సేచ్చావతి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో.. నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖ అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే అశోక్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. సమస్యలపై చర్చించారు.

● మఖరాంపురం వద్ద మాజీ సీఎం జగన్ ప్రారంభించిన వైఎస్సార్ సుజల పథకం ద్వారా ఎన్ని గ్రామాలకు నీరు అందుతుందని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు.. అధికారులను ప్రశ్నించారు. దీనిపై గ్రామీణ నీటిపారుదల శాఖ ఈఈ సుగణాకర్ మాట్లాడుతూ.. 'రూ.700 కోట్లతో ఏడు మండలాల్లో 807 గ్రామాలకు తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే రూ.600కోట్లు ఖర్చు చేసి 208 గ్రామాలకు నీరు అందిస్తున్నాం. మిగిలిన చోట్ల పైపులైన్ పనులు జరగుతున్నాయి. ఈ పనులు రెండు దశల్లో చేసేందుకు కాంట్రాక్టర్ ఒప్పందం కుదుర్చుకోగా.. మొదటి దశ పూర్తయింది. ట్యాంకులు లేని చోట ఉద్దానం ప్రాజెక్టుకు సంబంధించిన పాత ట్యాంకులు ఉపయోగించాం. కాంట్రాక్టర్ సక్రమంగా పనులు చేయకపోవటంతో కొన్నిచోట్ల పైపులు లీకులు ఉన్నాయి. వాటి పనులు పూర్తి చేయాల్సి ఉంద'ని తెలిపారు. అలాగే గత ఐదేళ్లలో నీటిపారుదల పనులకు సంబంధించి రూ.60లక్షలు మాత్రమే ఖర్చయ్యాయని వివరించారు. కాగా.. జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి కాకుండానే మాజీ సీఎం జగన్.. ఆర్భాటంగా ప్రారంభించడం ఆశ్చర్యంగా ఉందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా.. ఉత్తుత్తి ప్రకటనలతో ప్రజలను మోసగించిందని ఆరోపించారు. వైసీపీ నిర్లక్ష్యంతో జల్‌జీవన్ పనులు నిలిచిపోయాయన్నారు. సుజల పథకం ద్వారా పురుషోత్తపురం, ఏఎస్‌పేటలో మూడు వార్డుల ప్రజలకు తాగునీరు అందించేలా నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. 'అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారు. జిల్లాకు నీటి సరఫరా విషయంలో సమస్యలపై ఒడిశా ప్రభుత్వంతో చర్చిస్తాం. ప్రధాన సమస్యలన్నీ పరిష్కరిస్తాం. అధికారులు అలసత్వాన్ని వీడి.. బాధ్యతతో పనిచేస్తే లక్ష్యాలను సాధించగల'మని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

● ఐదేళ్ల పాలన.. అస్తవ్యస్తం

సమీక్ష అనంతరం విలేకరులతో కేంద్రమంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో అంతా అస్తవ్యస్తం అయిందన్నారు. 'టీడీపీ హయాంలో నదుల అనుసంధానం కోసం చంద్రబాబు ప్రణాళిక సిద్ధం చేస్తే.. వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. దీంతో ఈ ప్రాంతం తీవ్ర నష్టపోయింది. నదులు అనుసంధానం చేస్తే భూగర్భ జలాలు పైకి వచ్చి.. పంటలు పుష్కలంగా పండుతాయి. వలసలు నివారించవచ్చు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ఉద్దానం ప్రాంత ప్రజలు కిడ్నీవ్యాధి బారిన పడుతున్నా'రని తెలిపారు. గత ప్రభుత్వం నీటిపారుదలశాఖ నిధులను సైతం పక్కదారి మళ్లించిందని ఆరోపించారు.

మహిళలకు రక్షణగా..

● రణస్థలానికి చెందిన ఓ యువతి పారిశ్రామిక వాడలో పని చేస్తోంది. అక్కడ తోటి ఉద్యోగుల నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో ఏం చేయాలో ఆమెకు పాలుపోవడం లేదు. బయటకు చెబితే ఎక్కడ పరువుపోతుందోనని భయపడి ఉద్యోగం మానేసింది.

....

● రణస్థలం మండలానికి చెందిన ఓ యువతి శ్రీకాకుళం ఆస్పత్రిలో పనిచేస్తోంది. అక్కడ పని చేసేవారు చాలారకాలుగా ఆమెను ఇబ్బంది పెడుతున్నారు. ఈ విషయం యజమానికి చెబితే ఏమవుతుందోనని భయపడి తనలో తానే మదనపడుతోంది. కుటుంబం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో పని చేస్తోంది.

- తెరపైకి అంతర్గత కమిటీలు
- పది మంది ఉద్యోగులు ఉన్న చోట ఏర్పాటు
- వేధింపులు రుజువైతే శాఖాపరమైన చర్యలు

(రణస్థలం)

..ఇలా పనిచేసే చోట్ల చాలామంది మహిళలు లైంగిక వేధింపులు, మానసికంగా హింసలకు గురవుతుంటారు. పెరిగిన ఖర్చుల నేపథ్యంలో ఇంట్లో దంపతులిద్దరూ పనిచేస్తే కానీ ఇల్లు గడవని పరిస్థితి నెలకొంది. ఇటీవల ప్రతి పరిశ్రమ, సంస్థల్లో మహిళల ప్రాతినిథ్యం పెరిగింది. అటువంటి చోట పురుషుల నుంచి వేధింపులు పెరుగుతుండడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. వీటికి చెక్ చెప్పేందుకు ప్రభుత్వం చొరవ చూపుతోంది. మహిళలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉద్యోగం, పనులు చేసుకునే వీలుగా చర్యలు తీసుకుంటోంది. వారికి రక్షణ కల్పించేందుకు అంతర్గత కమిటీల ఏర్పాటుపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. దీంట్లో భాగంగా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో మహిళల రక్షణకు కమిటీలను ఏర్పాటు చేస్తోంది. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని కేంద్రప్రభుత్వం 2013లో.. ప్రవేశపెట్టింది. ఇది పూర్తిస్థాయిలో అమలుకావడం లేదని గుర్తించింది. అందుకే దీనిని పక్కాగా నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మహిళా శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ జిల్లాలో సన్నాహాలు ప్రారంభించింది. పెద్దఎత్తున చైతన్య కార్యక్రమాలు నిర్వహించింది.



అంతర్గత కమిటీల ఏర్పాటుపై సమావేశం(ఫైల్)

● ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో..

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వర్కింగ్ హోం, క్రీడా సంస్థలు, పరిశ్రమలు, ఆస్పత్రులు, సహకార సంస్థలు, విద్యాసంస్థలు, బ్యాంకులు, కార్పొరేషన్లు, స్వయం ఉపాధి సంస్థల్లో పది మంది పనిచేసే చోట ఒక్క మహిళ ఉన్నా.. విధిగా కమిటీ ఏర్పాటు చేయాల్సిందే. పది మంది కంటే ఉద్యోగులు తక్కువగా పనిచేసిన చోట మహిళలకు సమస్యలు వస్తే జిల్లా కమిటీలను ఆశ్రయించవచ్చు. పది మంది ఉద్యోగులు ఉండేచోట ఐదుగురితో కమిటీ వేస్తారు. ఇందులో 50 శాతం మహిళలే సభ్యులుగా ఉండాలి. ఈ లెక్కన ఇద్దరి నుంచి ముగ్గురు వరకూ మహిళలు విధిగా ఈ కమిటీల్లో ఉంటారు. ఈ అంతర్గత కమిటీ సభ్యుల పేర్లు, కార్యవర్గం వివరాలు అందరికీ కనిపించేలా నోటీస్ బోర్డులో పెట్టాలి. ఎవరైనా లైంగికంగా, మానసికంగా వేధిస్తే వెంటనే అంతర్గత కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు. అక్కడే ఫిర్యాదు బాక్సులో సమస్యను వివరిస్తూ లేఖ వేయవచ్చు. దీనిపై అంతర్గత కమిటీలో చర్చిస్తారు. అక్కడ సమస్య పరిష్కారం కాకుంటే జిల్లా కమిటీకి ఆశ్రయిస్తారు. అక్కడ విచారించి నేరం రుజువైతే చర్యలు తీసుకుంటారు. జిల్లా కమిటీలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మహిళా శిశుసంరక్షణా దికారి సభ్యులుగా ఉంటారు. ఒకవేళ మహిళ ఉద్దేశపూర్వకంగా, తప్పుడు కేసులు పెడితే ఆమెపై సైతం చర్యలుంటాయి.

తప్పుడు నిర్ణయాలకు చెక్



ఇప్పటికీ చాలాచోట్ల వేధింపులు ఎదురవుతున్నాయి. వేధింపులు తట్టుకోలేక చాలామంది క్షణికావేశంతో తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు. మహిళలకు అంతర్గత కమిటీలు ఎంతగానో దోహదపడతాయి.

- ముప్పుడి సుజాత, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి

కమిటీల ఏర్పాటు తప్పనిసరి



ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో విధిగా అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలి. పది మంది ఉద్యోగులు ఉన్నచోట ఒక్క మహిళ ఉన్నా కమిటీలను ఏర్పాటు చేయాల్సిందే. మహిళా రక్షణకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కమిటీలు ఏర్పాటు చేయకపోతే రూ.50వేలు జరిమానా విధించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

- సీహెచ్ ఝాన్సీరామ్, సీడీపీవో, రణస్థలం

మంచి నిర్ణయం



మహిళల రక్షణకు ఇది ఎంతగానో దోహదపడుతుంది. ఇప్పటికీ కొన్నిచోట్ల లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. అటువంటివి ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. ఈ అంతర్గత కమిటీలతో వాటికి పరిష్కారం చెప్పొచ్చు. ఫిర్యాదు బాక్సుల్లో ఫిర్యాదు చేయవచ్చు. మంచి నిర్ణయాన్ని ప్రకటించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- కే.వేణు, సబ్‌రిజిస్ట్రార్, రణస్థలం



కేంద్ర, రాష్ట్ర మంత్రులకు పౌరసన్మానం

కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడుకు టెక్కలిలో పార్టీ శ్రేణులు, అభిమానులు అపూర్వ స్వాగతం పలికారు. పౌరసన్మాన కార్యక్రమంలో భాగంగా గజమాలతో వారిద్దరినీ సత్కరించారు. జోరువానలో సైతం ర్యాలీలో పాల్గొని పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. జిల్లాలో వలసల నివారించి.. సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

- టెక్కలి

ఎల్ఎల్‌బీ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, జూలై 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ న్యాయ కళాశాలల్లో చదువుతున్న ఎల్ఎల్‌బీ విద్యార్థుల పరీక్ష ఫలితాలను వర్సిటీ అధికారులు శుక్రవారం విడుదల చేశారు. మూడేళ్ల లా కోర్సులో మూడో సెమిస్టర్ చదువుతున్న 91 మందిలో 84 మంది ఉత్తీర్ణులయ్యారు. ఐదేళ్ల లా కోర్సులో మూడో సెమిస్టర్‌లో 29కు 20 మంది, ఆరో సెమిస్టర్‌లో 20కు 18 మంది, ఏడో సెమిస్టర్‌లో 23కు 21 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల వివరాలను వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచామ ని పరీక్షల డీన్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు.

ఆంధ్ర యూనివర్సిటీలో బీఎస్-ఎంఎస్



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ)- స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) సహకారంతో నిర్వహిస్తున్న బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఆరేళ్ల వ్యవధిగల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్. మొదటి మూడేళ్లు ఆంధ్ర యూనివర్సిటీలో, చివరి మూడేళ్లు స్వీడన్ బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఆంధ్ర యూనివర్సిటీ నుంచి బీటెక్ డిగ్రీ; బీటీహెచ్ నుంచి బీఎస్-ఎంఎస్ డిగ్రీ లభిస్తాయి. బీటీహెచ్‌లో నాలుగో ఏడాది పూర్తిచేసి ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి ఏయూ నుంచి బీటెక్ డిగ్రీ, బీటీహెచ్ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తాయి.

ప్రోగ్రామ్స్ వివరాలు

1. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ కంప్యూటర్ సైన్స్
2. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్
3. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్ అండ్ సిస్టమ్స్

అర్హతలు: ఏపీ ఇంటర్ బోర్డ్/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 70 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీ సెట్ 2024/టీజీ ఈఏపీ సెట్ 2024/ ఏయూఈఈటీ 2024 స్కోర్ తప్పనిసరి. తెలుగు మాధ్యమంలో చదివిన అభ్యర్థులకు టోఫెల్ 575/90 స్కోర్ ఉండాలి. లేదా ఐఈఎల్‌టీఎస్‌లో మొత్తమ్మీద 6.5, సెక్షనల్‌గా 5.5 గ్రేడ్‌కు తగ్గకుండా ఉండాలి.

ఎంపిక: జేఈఈ మెయిన్ 2024 స్కోర్ ద్వారా 50 శాతం సీట్లు భర్తీ చేస్తారు. మిగిలిన సీట్లను ఏపీ ఈఏపీ సెట్ 2024, టీజీ ఈఏపీ సెట్ 2024, ఏయూఈఈటీ 2024 స్కోర్ల ద్వారా అలాట్ చేస్తారు.

- **అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు:** రూ.4000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూలై 20
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 23
- **ఈ-మెయిల్:** indiarelations@bth.se, internationalaffairs.au@gmail.com
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Mx7wZFHలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎంటెక్ స్పాట్ అడ్మిషన్స్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ రౌండ్ అడ్మిషన్స్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గేట్ అర్హత ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. మొత్తం 89 సీట్లు ఉన్నాయి. ఆసక్తిగల అభ్యర్థులు జూలై 26న తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాలి.

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో నిర్దేశించిన ప్రకారం కనీసం 55 లేదా 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **రిపోర్టింగ్ తేదీ:** జూలై 26న ఉదయం తొమ్మిదిన్నరకు
- **వేదిక:** సీఈ ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్, అడ్మిన్ బిల్డింగ్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్-500046.
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in, www.uohyd.ac.in

జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్

జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- 'జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్‌ఏటీ)2025' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారానే దేశవ్యాప్తంగా కొన్ని ప్రముఖ బీ-స్కూళ్లు, పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో ఎంబీఏ, ఇతర మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎక్స్ఎల్ఆర్ఐ జంషెడ్‌పూర్, ఢిల్లీ క్యాంపస్‌లు అందిస్తున్న పీజీడీఎం ప్రోగ్రామ్‌లో కూడా అడ్మిషన్ పొందవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసినవారు అర్హులు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి 2025 జూన్ నాటికి పరీక్షలు పూర్తికావాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎక్స్‌ఏటీ 2025: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో రెండు పార్టులు ఉంటాయి. మొదటి పార్ట్‌లో వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 26 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంట్రప్రిటేషన్ నుంచి 28 ప్రశ్నలు, డెసిషన్ మేకింగ్ నుంచి 21 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు వర్తిస్తాయి. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. రెండో పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. ఒక అనలిటికల్ ఎస్సే రాయాల్సి ఉంటుంది. వీటికి నెగెటివ్ మార్కులు లేవు. జనరల్ నాలెడ్జ్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోరు. పరీక్ష సమయం మూడున్నర గంటలు. మొదటి పార్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి వీరు రాసిన ఎస్సేలను మాత్రమే పరిశీలిస్తారు. తరవాత పర్సనల్ ఇంటర్వ్యూలు ఉంటాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 30
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **ఎక్స్‌ఏటీ 2025 తేదీ:** 2025 జనవరి 5
- **ఫలితాలు విడుదల:** 2025 జనవరి 20
- **వెబ్‌సైట్:** www.xatonline.in, mbauniverse.com

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంట్రప్రిటేషన్(డీఐఎస్ఎల్ఐ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్‌నకు రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. ఇంగ్లీష్, హిందీ, తమిళం మాధ్యమాల్లో బోధన ఉంటుంది. నెలకు రూ.2000ల స్టయిపెండ్ ఇస్తారు.


అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 29
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్ మార్కుల పత్రాలు; టీసీ; ఆధార్ కార్డ్; కమ్యూనిటీ సర్టిఫికెట్; అభ్యర్థి ఫొటో
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in


నవ్య | చిత్రజ్యోతి

అరుదైన గౌరవం!

మెల్‌బోర్న్ వేదికగా జరిగే 'ది ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ 15వ ఎడిషన్‌కు హీరో రామ్‌చరణ్ అతిథిగా హాజరు కానున్నారు. ఇందులో బహూకరించే సినిమా అవార్డులకు తన స్టార్ పవర్‌ను జోడించడం ఆసక్తికరం. భారతీయ చిత్ర పరిశ్రమకు చేసిన సేవలకు ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్ అంబాసిడర్‌గా అవార్డ్ అందుకోనున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ 'మన భారతీయ చిత్రాల్లోని వైవిధ్యాన్ని, గొప్పదనాన్ని అంతర్జాతీయ వేదికగా వేడుక నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఈ వేడుకలో పాల్గొనే అవకాశం రావడం నాకు దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తున్నాను. తెలుగు చిత్ర పరిశ్రమ తరఫున నేను ప్రాతినిధ్యం వహించడం ఆనందం కలిగించే అంశం. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రముఖుల్ని, అభిమానుల్ని కలుసుకోవడానికి ఇది మంచి అవకాశంగా భావిస్తున్నాను' అన్నారు.



ఏజెంట్ జాన్ స్నో



నితిన్, శ్రీలీల జంటగా రూపుదిద్దుకుంటున్న యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకత్వంలో ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఇందులో సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఏజెంట్ జాన్ స్నో పాత్రను పోషిస్తున్నారు. ఆయన అసలు పేరు జనార్థన్ సున్నిపెంట అయితే జాన్ స్నో గా మార్చుకోడం ఆసక్తికరం. శుక్రవారం రాజేంద్రప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా సినిమాలో ఆయన ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. చిత్రంలో ఆయనది కీలకమైన పాత్ర అనీ, వినోదభరితంగా ఉంటుందని దర్శకుడు వెంకీ చెప్పారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'రాబిన్‌హుడ్' చిత్రం డిసెంబర్ 20న విడుదలవుతుంది.

వివాదం విచారణ వివరణ



కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లో చల్లగాలులు పలకరిస్తుంటే కోర్టు కేసులు, పోలీసు విచారణలు, విడాకులు, వివరణల వార్తలతో చిత్రసీమ వేడెక్కింది. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమలు శుక్రవారం పలు వివాదాలతో వార్తల్లో నిలిచాయి.

వివాదం

రూ. పాతిక కోట్లకు పరువునష్టం దావా

'కల్కి 2898 ఏడీ' చిత్రానికి వచ్చిన వసూళ్లు అంతా ఫేక్ అనే వ్యాఖ్యలు చేసిన బాలీవుడ్ సినీ విమర్శకులు సుమిత్ కడేల్, రోహిత్ జైస్వాల్‌పై నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ రూ. 25 కోట్లకు పరువు నష్టం దావా వేసింది.

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి' చిత్రం బాక్సాఫీసు దగ్గర సత్తా చాటుతోంది. ఇటీవలే రూ. వెయ్యికోట్ల క్లబ్‌లో చేరినట్లు వైజయంతి మూవీస్ ప్రకటించింది. అయితే ఇవన్నీ ఫేక్ కలెక్షన్‌లు అని సుమిత్, రోహిత్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. రూ. 800 కోట్లు వస్తే, రూ. వెయ్యి కోట్లు అని చెబుతున్నారని విమర్శించారు. దీంతో వైజయంతి మూవీస్ రంగంలోకి దిగింది. 'కలెక్షన్లు ఫేక్ అని మీకు ఎవరు చెప్పారు? మీ దగ్గర ఉన్న ఆధారాలే మాకు చూపించండి, లేదా రూ. 25 కోట్లు చెల్లించండి' అని నోటీసులు పంపింది. గతంలోనూ ఇలాగే సుమిత్, రోహిత్ ప్రభాస్ చిత్రాలను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించారు.

విడాకులు నిజమేనా?

అభిషేక్‌బచ్చన్, ఐశ్వర్యారాయ్ బచ్చన్ దంపతుల విడాకులు ఖాయమనే ప్రచారం కొన్నాళ్లుగా బాలీవుడ్ సర్కిళ్లలో విస్తృతంగా ప్రచారమవుతోంది. అయితే అభిషేక్‌బచ్చన్‌తో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసిన ఐశ్వర్య తాముకలిసే ఉన్నామంటూ చెప్పకనే చెప్పారు. అయినా ఆ ప్రచారం మాత్రం ఆగలేదు. ఇటీవలే అనంత్ అంబానీ పెళ్లికి సైతం వీరిద్దరూ విడివిడిగా రావడమే గాకుండా ఫొటోలు సైతం విడిగానే దిగారు. దీంతో మరోసారి వీరి విడాకుల వ్యవహారం వార్తల్లో నిలిచింది. ఇప్పుడు అభిషేక్‌బచ్చన్ ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఓ విడాకుల పోస్ట్‌కు లైక్ కొట్టారు. దీంతో వీరిద్దరూ విడిపోబోతు



న్నారు కాబట్టే అభిషేక్ ఆ పోస్ట్‌కు లైక్ కొట్టాడని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. రచయిత హీనా ఖండేల్‌వాలా షేర్ చేసిన ఆ పోస్ట్‌లో ఏముందంటే 'కొన్నిసార్లు జీవితం మనం అనుకున్నట్లు సాగదు. విడిపోవడం అనేది అనుకున్నంత సులభం కాదు. అయినా 50 ఏళ్లు దాటిన వారు కూడా రకరకాల కారణాలతో విడిపోతున్నారు. దశాబ్దాల పాటు కలసి బతికిన వారిని ఇప్పుడు విడిపోవడానికి పురికొల్పుతున్నది ఏమిటి' అనేది ఆ పోస్ట్ సారాంశం.

విచారణకు రాలేను

- రాజ్‌తరుణ్



రాజ్‌తరుణ్, ఆయన మాజీ ప్రియురాలు లావణ్య ప్రేమ వ్యవహారం కేసులో విచారణ కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ఈ నెల 18న విచారణకు హాజరవ్వాలని నార్సింగ్ పోలీసులు రాజ్‌తరుణ్‌కు నోటీసులు ఇచ్చారు. అయితే ఆయన గైర్హాజరయ్యారు. ప్రస్తుతం తాను అందుబాటులో లేనని, విచారణకు హాజరవ్వలేనని రాజ్‌తరుణ్ పోలీసులకు తన న్యాయవాది ద్వారా వివరణ పంపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ మేరకు కొత్త సినిమా చిత్రీకరణ, ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉండడమే అందుకు కారణమని పేర్కొన్నారు. దీంతో రాజ్‌తరుణ్‌కు మరోసారి నోటీసులు ఇచ్చి, అప్పటికీ విచారణకు హాజరవ్వకపోతే తదుపరి చర్యలు చేపట్టాలని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం.

వివరణ

చిన్న చిన్న గొడవలే... సమసిపోతాయి

- బన్నీవాసు

'ఏ కుటుంబంలో అయినా ఒకరు తీసుకున్న నిర్ణయాల వల్ల కొన్ని సమస్యలు వస్తాయి. ఇలాంటివి మామూలే. వచ్చిపోతుంటాయి. సమయం వచ్చినప్పుడు 'మేం అంతా ఒక్కటే' అని మెగా - అల్లు ఫ్యామిలీ చాటి చెబుతుంది' అన్నారు నిర్మాత బన్నీవాసు. శుక్రవారం ఆయన ఓ సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అల్లు అర్జున్ గత ఎన్నికల్లో వైసీపీ నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిశోర్‌కు ప్రచారం చేయడం మెగా-అల్లు కుటుంబాల మధ్య విభేదాలకు దారితీసిందనే ప్రచారం కొన్నాళ్లుగా జరుగుతోంది. ఇదే విషయాన్ని పాత్రికేయులు బన్నీవాస్‌ను అడగ్గా, ఆయన 'అవును' అని గానీ, 'కాదు' అని గానీ సూటిగా సమాధానం చెప్పకుండా దాటవేశారు. పాత్రికేయుల ప్రశ్నకు సమాధానమిస్తూ 'అవన్నీ చిన్న చిన్న గొడవలే.. సమసిపోతాయి' అనే అర్థం వచ్చేలా మాట్లాడారు. 'గడ్డు పరిస్థితుల్లో ఆ రెండు కుటుంబాలు ఒకరికి ఒకరు అండగా నిలిచాయి. ఏ కుటుంబంలో అయినా కొన్ని సార్లు చిన్న చిన్న గొడవలు వస్తుంటాయి. అంతమాత్రాన వారి అనుబంధం దెబ్బతిన్నట్లు కాదు. వాటినే హైలైట్ చేయడం మంచిది కాదు. నేను 20 ఏళ్లుగా మెగా-అల్లు ఫ్యామిలీని చూస్తున్నా. 'కుటుంబ సభ్యులందరూ కలసి ఉండాలని చిరంజీవి గారు ఎప్పుడూ కోరుకుంటారు. ప్రతి సంక్రాంతికి ఆయన కుటుంబ సభ్యులందరినీ తీసుకొని బెంగళూరు వెళ్తారు. మనమందరం ఒకటే అనే భావన కుటుంబ సభ్యుల్లో కలిగించాలనేదే ఆయన ఆలోచన' అని చెప్పారు.

క్షమాపణ

తప్పు చేశా... మన్నించండి

'హీరోయిన్ తమన్నా సాంగ్ ఉంటే చాలు... కథలో పస లేకపోయినా సినిమా హిట్టవుతుంది. ఇప్పుడు ప్రేక్షకుల అభిరుచి అలా తయారైంది' అంటూ ఓ ఇంటర్వ్యూలో తమిళ నటుడు పార్తీబన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దిగజారుడు వ్యాఖ్యలు చేశారంటూ కోలీవుడ్ చిత్ర పరిశ్రమ ఆయన తీరును తప్పుబట్టింది. దీంతో పార్తీబన్ క్షమాపణలు చెప్పారు. 'చిత్ర పరిశ్రమకు చెందిన



అందరినీ నేను గౌరవిస్తాను. నటీనటులను తక్కువ చేసే ఆలోచన నాకు లేదు. నా మాటలు ఎవరికైనా ఇబ్బంది కలిగిస్తే నన్ను క్షమించండి' అని పార్తీబన్ కోరారు. రజనీకాంత్ 'జైలర్' చిత్రంలో తమన్నా ప్రత్యేకగీతంలో నర్తించారు. అలాగే ఆమె లీడ్‌రోల్ పోషించిన 'బాక్' చిత్రం కూడా మంచి వసూళ్లను సాధించింది. ఈ నేపథ్యంలో ఆ రెండు సినిమాలను దృష్టిలో ఉంచుకొనే పార్తీబన్ ఈ వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నారు.

ఆయ్.. అందరినీ ఆకట్టుకుంటుంది



'ఆయ్.. అనే టైటిల్ పెడితే ఒక ప్రాంతానికే పరిమితం అవుతుందా అని అనుకున్నాం. కానీ కథ బాగుంటే అందరూ ఆదరిస్తారనే నమ్మకంతో ఫిక్స్ చేశాం. ఈ కథను ఓకే చేసిన హీరో నితిన్‌కు అభినందనలు. అంతా ఓకే అనుకున్న తర్వాత ఎన్టీఆర్‌కు ఫోన్ చేశాను. 'ఫస్ట్ డే వరకూ మనం పుష్ చేస్తాం. ఆ తర్వాత సినిమా బాగుంటేనే ఆడుతుంది. ఎవరి కష్టం వారిదే. కథ బాగుందని అంటున్నారు కనుక చేసేయ్యండి' అని ఆయన చెప్పారు. ఈ సినిమాలో వర్షం కోసమే రూ. కోటికి పైగా ఖర్చు పెట్టారు. సినిమా చూస్తే మనం నిజంగానే ఆ ఊళ్లోకి వెళ్లి వర్షంలో తడుస్తున్నట్లుగా అనిపిస్తుంది' అన్నారు అల్లు అరవింద్. ఆయన సమర్పణలో నార్నే నితిన్ హీరోగా బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన 'ఆయ్' చిత్రం థీమ్ సాంగ్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అల్లు అరవింద్ మాట్లాడారు. మంచి గోదావరి సినిమా తీశామనీ, స్నేహం గురించి ఇందులో చెప్పామనీ హీరో నార్నే నితిన్ చెప్పారు. ఈ సినిమా చూస్తుంటే నవ్వి నవ్వి బుగ్గలు నొప్పి పెడతాయని బన్నీ వాసు చెప్పారు. గోదావరి ప్రాంతాన్ని బేస్ చేసుకుని తీసిన సినిమాల్లో 'ఆయ్' బెస్ట్ అవుతుందని దర్శకుడు అంజి కె మణిపుత్ర చెప్పారు.

కొత్త ప్రపంచంలోకి తంగలాన్

తమిళ హీరో విక్రమ్ నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్' విడుదల తేదీని ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా చెప్పారు. పా రంజిత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పార్వతి తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యథార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ సినిమా ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.



వలసలు లేని జిల్లాగా తీర్చిదిద్దుతాం

●ప్రతి ఎకరాకూ నీరందిస్తాం ●పారిశ్రామికరంగానికి పెద్దపీట ● టెక్కలిలో రామ్మోహన్, అచ్చెన్నకు పౌరసన్మానం


రామ్మోహన్, అచ్చెన్నకు పౌరసన్మానం చేస్తున్న నాయకులు

టెక్కలి: 'టెక్కలితో పాటు జిల్లా చరిత్రను తిరగరాస్తాం. ప్రతి నిమిషం మీకోసంపనిచేస్తాం. జిల్లాలో వలసలు నివారణకు చర్యలు తీసుకుంటాం. ప్రజలు మాకు సహకరించాలి. కింజరాపు కుటుంబం ఏది చెబితే అది చేస్తుంది. మాకు సహకరించండి'. అని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్థక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.శుక్రవారం టెక్కలి ప్రభుత్వజూనియర్ కళాశాల ప్రాంగణంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడులకు పౌరసన్మాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ హిరమండలం నుంచి పలాస వరకు వంశధార ప్రధాన ఎడమకాలువ లైనింగ్ పనులు పూర్తిచేయించి ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామన్నారు. ఐదేళ్లపాటు గాలికొదిలేసిన ఆఫ్‌షోర్ పనులు ప్రారంభించి నీరందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.వలసలు లేని జిల్లాగా తీర్చిదిద్దుతామని చెప్పారు. తీరప్రాంతంలో మత్స్యకారుల అభివృద్ధికి హార్బర్ల నిర్మాణం, ఫిష్‌ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటు, కోల్డ్‌స్టోరేజ్‌ల సౌకర్యం కల్పించి మత్స్యకారులు వలసలు వెళ్లకుండా స్థానికంగా ఆదుకునే ప్రయత్నాలు చేస్తామన్నారు. నిరుద్యోగ యువతకు ఆదుకునే దిశగా పారిశ్రామికరంగానికి పెద్దపీటవేసి ఉపాధి కల్పిస్తామన్నారుతాను నియోజకవర్గానికి వచ్చే ప్రతిసారి రెండుగంటల పాటు టెక్కలిలో తిరిగి సమస్యలు పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు. నియోజకవర్గంలో వంద రోజుల కార్యక్రమం పెట్టి ప్రజాపాలన మొదలు పెడతామని, పాలనలో శక్తిమేరకు ప్రతిఒక్కరికి న్యాయంచేసి మన్ననలు పొందుతానన్నారు. జగన్ ఒక పెద్దదొంగ అని, ఆ పార్టీలో ఉన్న కింది స్థాయి నాయకులు కూడా అదేస్థాయి దొంగలని, అందుకే ఎత్తిపోతల పథకాల ట్రాన్స్‌పార్మర్లలో రాగివైరునుకూడా చోరీ చేశారన్నారు.చంద్రబాబు నాయుడును అప్పటి సీఎం జగన్ పలు కేసుల్లో ఇరికించారని, అదేజగన్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని తెలిపారు. జగన్ వేలకోట్ల రూపాయలు అప్పులుచేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. జగన్ రైతులకు రూ.1,600కోట్లు బకాయి పెట్టాడని, ఆ బకాయిని కూటమి ప్రభుత్వం తీర్చిందని చెప్పారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ ఐదేళ్లపాటు టీడీపీ కార్యకర్తలు నిద్రలేని రాత్రులు గడిపారన్నారు. బా హుదా, వంశధార నదుల అనుసంధానం పూర్తిచేసేందుకు కృషిచేస్తానని, మూలపేట పోర్టు నిర్మాణంతో ప్రగతి సాధిస్తామని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని తెలిపారు. వలసలు నిర్మూలించి శ్రీకాకుళం పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. దేశంలోనే శ్రీకాకుళం నెంబర్-1 స్థానంలో ఉండేలా చర్యలు చేపడతామని తెలిపారు.

చిరుజల్లులు కురుస్తున్నా...

జగతిమెట్ట జంక్షన్ నుంచి పాతజాతీయరహదారి మీదుగా ఇందిరా గాంధీ కూడలి, పాతబస్టాండ్, అంబేద్కర్ జంక్షన్ మీదుగా జూనియర్ కళాశాల మైదానానికి చిరుజల్లుల్లోనే చేరుకున్నారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ సంస్థలు, సంఘాలు, కుల సంఘాలనాయకులు జోరువానలో అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడులకు పౌరసన్మానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కింజరాపు హరిప్రసాద్, బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, బోయిన రమేష్, జీరు భీమారావు, కణితి కిరణ్‌కుమార్, అట్టాడ రవిబాబ్జీ, బిర్లంగి ఉమామహేశ్వరరావు, పి.తిరుపతిరావు, బోయిన గోవిందరాజులు, చౌదరి బాబ్జి, ఎల్ఎల్ నాయుడు, పద్మావతి, దమయంతి, సుందరమ్మ, లవకుమార్, కామేసు, మామిడి రాము, కింగ్, దోని బుజ్జి, దల్లి ప్రసాద్‌రెడ్డి, మల్లిపెద్ది మధు, ప్రీతీష్ పాల్గొన్నారు.

యువకుడికి బ్రెయిన్‌డెడ్

● కుటుంబ సభ్యుల అంగీకారంతో అవయవాల దానం


శ్రీనివాస రావు(ఫైల్)

సంతబొమ్మాళి: మండలంలోని గోవిందపురం పంచాయతీ జొన్నలపాడుగ్రామానికి చెందిన చల్లశ్రీనివాసరావు(26) బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యుల అంగీకారంతో అవయవాలను దానం చేశారు. గ్రామస్థుల కథనం మేరకు.. విశాఖలోని ఓ ఆసుపత్రిలో ఉన్న వ్యక్తిని నరసన్నపేట శ్రీనివాసరావు ఈనెల 14వ తేదీ నాలుగుగంటల సమయంలో తీసుకువస్తున్నాడు.పెద్దపాడు సమీపంలోని కేంద్రీయ విద్యాలయం వద్ద లారీ ఢీకొట్టడంతో శ్రీనివాసరావు గాయపడ్డాడు. దీంతోచికిత్సకోసం ఓ ఆసుపత్రికి తరలించారు. వారంరోజులుగా కోమాలో ఉన్న శ్రీనివాసరావు బ్రెయిన్‌డెడ్ కావడంతో ఆయన అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. దీంతో శుక్రవారం ఆయన కిడ్నీ, లీవర్,హార్ట్‌తోపాటు ఇతర అవయవాలను దానంచేశారు. శ్రీనివాసరావు అంత్యక్రియలు శుక్రవారంగ్రామంలో నిర్వహించారు.శ్రీనివాసరావు తల్లిదండ్రులు చల్ల మల్లేసు,అప్పమ్మలకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో చిన్నకుమారుడు శ్రీనివాస్. ఆయనకు వివాహం కూడా కాలేదు. శ్రీనివాసరావు మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.అంత్యక్రియల్లో సర్పంచ్‌లు రెడ్డి అప్పన్న, గూట్ల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

22 నుంచి జీడి పరిశ్రమల బంద్

పలాస: కిలోకు రూ.100 వరకూ జీడిపప్పు ధరలు తగ్గడంతో పలాస పారిశ్రామికవాడలో జీడిపరిశ్రమల వ్యాపారులు ఈనెల 22నుంచి 15రోజుల పాటు పరిశ్రమలు బంద్ చేయడానికి నిర్ణయించారు.ఈమేరకు ఆ సంఘ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం వ్యాపారుల అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పారిశ్రామిక వాడ జీడీపప్పు ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ అమ్మకాలు పూర్తిగా పడిపోయాయని, గతంలో అమ్మిన జీడి పప్పుకు ఇప్పటి వరకూ సొమ్ములు చేసుకోలేకపోయామని తెలిపారు. దీనికితోడు పప్పు నిల్వలు పేరుకుపోవడంతో వ్యాపారులు సంకటస్థితిని ఎదుర్కొంటున్నారని చెప్పారు. బంద్‌చేస్తే గాడికి వచ్చే అవకాశం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం పారిశ్రామికవాడలో మొత్తం 40కుపైగా జీడి పరిశ్రమలు ఉండగా మూడువేల మంది వరకూ కార్మికులు వివిధ విభాగాల్లో పని చేస్తున్నారని చెప్పారు.

● పలాస జీడి పప్పు ఉత్పత్తిదారుల సంఘ పరిధిలో ఉన్న పరిశ్రమలన్నీ ఈనెల 22 నుంచి 15 రోజుల పాటు బంద్ చేయడానికి తాము కూడా నిర్ణయించామని ఆ సంఘ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కేవీ శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కార్మిక సంఘానికి లేఖ అందించామని పేర్కొన్నారు.వ్యాపారుల నిర్ణయం మేరకు తాము బంద్ చేయదలచామని, కార్మికులు, ప్రజలు సహకరించాలని కోరారు.

●కార్మికుల అభిప్రాయాలు తీసుకొని నిర్ణయం తీసుకుంటామని జీడి కార్మికసంఘ ప్రధాన కార్యదర్శి బొమ్మాళి తాతయ్య తెలిపారు. పలాస, పారిశ్రామికవాడ జీడి వ్యాపార సంఘాల నుంచి లేఖలు అందాయని పేర్కొన్నారు. శనివారం జీడి కార్మికసంఘ భవనంలో కార్మికులు, సంఘ నాయకులతో సమావేశం ఏర్పాటుచేస్తామని తెలిపారు.

నాణ్యమైన కందిపప్పు అమ్మకపోతే చర్యలు

టెక్కలి: నాణ్యమైన కందిపప్పు అమ్మకపోతే చర్యలు తప్పవని పౌరసరఫరాలశాఖ అధికారులు హెచ్చరించారు. శుక్రవారం కోటబొమ్మాళి పంచాయతీలో ఓ కిరాణాషాపులో కందిపప్పు నాణ్యతను శ్రీకాకుళం డీఎం కార్యాలయం టెక్నికల్ టీం సభ్యులు పి.నాగేంద్ర, బి.గాయత్రి, సీఎస్‌డీటీ కె.రాము, వీఆర్వోలు పి.అఖిల్, టి.రాము పరిశీలించారు.

● **నందిగాం:** నందిగాంలో సరసమైన ధరకే కందిపప్పు విక్రయించడానికి రెండుషాపులు ఎంపిక చేసినట్లు తహసీల్దార్ వి.పద్మావతి తెలిపారు. బజారువీధిలోని గుడ్ల అప్పలసూరి, గుడ్లచిన్నారావు కిరాణాషాపులను గుర్తించామని, వాటిలో కందిపప్పును రూ.160లకు విక్రయిస్తారని చెప్పారు. కాగా కందిపప్పునాణ్యతపై పౌరసరఫరాల జిల్లా కార్యాలయానికి చెందిన క్వాలిటీ టెక్నికల్ అసిస్టెంట్ నవ్య షాపులను డీటీ ఎన్.పద్మావతితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో రమేష్‌కుమార్, అరుణ్‌కుమార్, శ్యామ్ పాల్గొన్నారు.

ఎంపీపీపై చర్యలు తీసుకోవాలి

● మందస టీడీపీ మండలాధ్యక్షుడు బావన దుర్యోధన

హరిపురం: విద్యుత్‌చౌర్యానికి పాల్పడిన వైసీపీనాయకుడు, ఎంపీపీ డొక్కరి దానయ్య పదవికి అనర్హుడని, ఆయనతోపాటు దీనికి సహకరించిన విద్యుత్ ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మందస టీడీపీ మండలాధ్యక్షుడు బావన దుర్యోధన కోరారు. శుక్రవారం హరిపురంలో విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ డొక్కరి దానయ్య, మాజీ మంత్రి సీదిరి వ్యక్తిగత సహాయకుడు జోగ కృష్ణారావు ఇళ్లపై విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులుచేసి అక్రమంగా విద్యుత్‌వాడకాన్ని గుర్తించారని తెలిపారు. వేలాది రూపాయలు బిల్లుల స్థానంలో నెలకు ఇరవై, ముప్పై రూపాయలు బిల్లు వచ్చేదని చెప్పారు. వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలు చేసిన ప్రతి ఒక్కరిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు.ఒక బాధ్యతగల ప్రజాప్రతినిధి చేయాల్సిన పని ఇదేనా.. వైసీపీ నాయకులు ఇంకా ఎన్ని అక్రమాలకు పాల్పడ్డారోనని తెలిపారు. ఈ సందర్భంగా బిల్లు పత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, బైరిశెట్టి గున్నయ్య, బమ్మిడి కర్రయ్య, నవీన్, చంద్రశేఖర్, సాలిన మాధవరావు, జానకిరావు, వల్లభరావు, వెంకట్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై వైసీపీకి చిత్తశుద్ధి లేదు

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష


వజ్రపుకొత్తూరు: పెద్దబొడ్డ వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌతుశిరీష

వజ్రపుకొత్తూరు: వైసీపీ పాలకులకు రైతుల సమస్యల పట్ల చిత్తశుద్ధి లేదని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష విమర్శించారు. శుక్రవారం మండలంలోని పెద్దబొడ్డపాడులో వంశధార 60 ఆర్ కాలువ ద్వారా రామసాగరంలోకి నీరు చేరడంతో టీడీపీ నాయకుడు దుంపల వల్లభరావు ఆధ్వర్యంలో జలహారతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కొత్తపేట పంచాయతీ దిబ్బవానిపేటలో జలజీవన్ మిషన్ ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు సూరాడ మోహనరావు, క్లస్టర్ ఇన్‌చార్జి కణితి సురేష్, టీడీపీ నాయకులు పి.విఠల్, అర్సవెల్లి ఉమామహేశ్వరరావు, కృష్ణ, గోవిందపాపారావు, కొల్లిరమేష్, కోనారి కిరణ్, దుంపల ముఖలింగం, మణిగాం తాతయ్య పాల్గొన్నారు. ●అక్కుపల్లి గురుకులపాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో సమస్యను పరిష్కారించాలని ప్రిన్సిపాల్ జి.ప్రశాంతి, విశ్రాంతి ప్రిన్సిపాల్ ఎం.పాపారావు, పాఠశాల కమిటీ చైర్మన్ రూప, సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందించారు.

స్వచ్ఛమైన తాగు నీరందించాలి

పలాస: ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరందించేందుకు అధికారులు చర్యలుతీసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. పలాస టీడీపీకార్యాలయంలో జలజీవన్ మిషన్ పథకం అమలుతీరుపై ఆ శాఖ ప్రాజెక్టు డీఈఈ ఆశాలత, ఎస్ఈ జాన్ జెన్నర్, డీఈఈ రజాక్, మెగాకంపెనీ జనరల్‌మేనేజర్ శాంతకుమార్‌తో సమీక్షించారు. కాగా జీఎస్‌టీ అసిస్టెంట్ కమిషనర్ యు.శ్రీనివాసులు, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ శ్వేత ఆధ్వర్యంలో అధికారుల బృందం ఎమ్మెల్యేను కలుసుకుంది. కిడ్నీ ఆసుపత్రిలో సాంకేతిక సిబ్బందిని నియమించాలని ఫార్మసీ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనెల గోపాల్ ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పీరుకట్ల విఠల్‌రావు, మల్లా శ్రీనివాస్, టంకాల రవిశంకర్‌గుప్తా, శాసనపురి మురళీకృష్ణ, పట్టణ కార్యదర్శి సప్ప నవీన్, డొక్కరి శంకర్, హరిశంకర్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అలసత్వం వద్దు

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


నరసన్నపేట:మాట్లాడుతున్న ఎమ్మెల్యేబగ్గు రమణమూర్తి

నరసన్నపేట: ఉపాధి పనుల్లో అలసత్వం లేకుండా చేయించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి డుమా అధికారులకు సూచించారు. శుక్రవారం నరసన్నపేటలో డుమా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజ్‌లు నిర్మించాలన్నారు. నాలుగు మండలాల్లో చెరువులను అభివృద్ధి చేసి సర్వసుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో పీడీ చిట్టిరాజు, ఏపీవో యుగంధర్, ఏపీడీ జయరాం పాల్గొన్నారు. అలాగే పార్టీ కార్యాలయంలో హడ్కోకాలనీ చెందిన ముగ్గురు వైసీపీ నుంచి టీడీపీలో ఎమ్మెల్యే సమక్షంలో చేరారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

జలుమూరు: విద్యార్థులకు గుణాత్మకమైన, నాణ్యమైన విద్యనందించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు.జలుమూరులోని కోనపెంటమ్మ రామమూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు కోసం నైపుణ్యం పెంచుకోవాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపాల్ జె.సారిక, టీడీపీ మండలాధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, టీడీపీ నాయకులు ఎం.దామోదరరావు, గోవిందరావు, రామచంద్రరావు, దుంగ స్వామిబాబు, చంద్రశేఖరరావు,భాస్కరరావు, డి.వేణుగోపాలరావు, నిరంజన్ పాల్గొన్నారు.

రోజంతా ఎడతెరిపిలేని వర్షం

●అన్నదాతకు ఊరట ● కాలనీలు బురదమయం
● రోడ్లపైకి నీరు చేరడంతో రాకపోకలు ప్రజలు అవస్థలు
●తడిచి ముద్దవుతున్న కార్యాలయాలు ●దెబ్బతిన్న రోడ్లు


నరసన్నపేట: చిక్కావలస అండర్ పాసేజ్ వంతెనలోకి చేరిన నీరు


నందిగాం: బురదమయమైన బంజీరుపేట రహదారి


పలాస: కాశీబుగ్గ-అక్కుపల్లి రోడ్డులో చేరిన వర్షం నీరు

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రోజంతా ఎడతెరిపిలేని వర్షం కురిసింది. కొద్దిరోజులుగా ఎండల తీవ్రతకు ఎదలు, వరి నారు మళ్లు ఎండిపోతుండడంతో రైతులకు ఊరట లభించింది. కొన్నిచోట్ల చెరువులు నిండుతున్నాయి. రోడ్లపైకి నీరుచేరడంతో రాకపోకలకు ప్రజలు అవస్థలుపడుతున్నారు. వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన రోడ్లు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దెబ్బతింటున్నాయి. పలు ప్రభుత్వ కార్యాలయాలు కారిపోవడంతో తడిచిముద్దవుతున్నాయి.

●**ఎల్.ఎన్.పేట:**మండలంలోని తురకపేట,దబ్బపాడు గ్రామాల మధ్యఉన్న కడపలగెడ్డ రోడ్డుపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో దబ్బపాడు గ్రామస్థులు ఇబ్బందిపడుతున్నారు. ఏటా వర్షాకాలంలో ఈ గ్రామస్థులు రాకపోకలు అవస్థలుపడున్నారు.అత్యవసర పరిస్థితుల్లో వైద్యంకోసం పట్టణాలకు తమ నుంచి వాడవలస, మిరియాపల్లి మీదుగా ఐదు కిలోమీటర్లు ప్రయాణించి లక్ష్మీనర్సుపేట జంక్షన్‌కు చేరుకోవలసి వస్తోందని గ్రామస్థులు ఎం.లక్ష్మణరావు, పి.సీతారాం, జె.మోహనరావులతోపాటు మరి కొంతమంది తెలిపారు. కాగా మూడురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తురకపేట, దబ్బపాడు, వాడవలస, సుమంతాపురం, చిట్టిమండలం, ధనుకువాడ, కోవిలాం, రావిచెంద్రి తదితర గ్రామాల్లోని లోతట్టుప్రాంతాల్లో పంటపొలాలు నీటిలో మునిగిపోయాయి. నీరు ఎక్కువరోజులు ఉంటే పంటలు పాడవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

● **టెక్కలి:** టెక్కలిలోని మండాపొలం కాలనీ, ఎన్టీఆర్ కాలనీ ప్రాంతాల్లో వర్షం నీటి వల్ల బురదమయమయ్యాయి. కాలువల్లోని మురుగు, చెత్త రోడ్డుపైకి చేరడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులకు గురయ్యారు. చిరుజల్లులతో చిరు, ఫుట్‌పాత్ వ్యాపారులు అవస్థలుపడ్డారు.

●**నందిగాం:** పెంటూరు-శివరాంపురం, నరేంద్రపురం జంక్షన్ నుంచి వల్లభ రాయుడుపేట, కొత్తగ్రహారం నుంచి జడ్యాడ, బడబంద జంక్షన్ నుంచి బంజీ రుపేటతోపాటు పలురోడ్లు వర్షాలు దెబ్బతిన్నాయి. నందిగాం ఎంఆర్‌సీ భవనం, మండలపరిషత్ సమావేశ భవనం, బంజీరుపేట ప్రాథమిక పాఠశాల తడిసిముద్దయ్యాయి.

● **వజ్రపుకొత్తూరు:** రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు బెండి నుంచి బెండిగేటుకు వెళ్లి ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గోతుల్లో నీరు చేరడంతో వాహన చోదకులు ఇబ్బందిపడుతున్నారు. అక్కుపల్లి, బాతుపురం వద్ద కూడా రోడ్డుపై ఉన్న గోతుల్లో నీరుచేరింది.

● **పలాస రూరల్:** మండలంలోని అల్లుకోల వద్ద హరిసాగరం, కేదారిపురం, బ్రాహ్మణతర్లావద్ద వరహాలగెడ్డలో వర్షాలకు నీరుచేరింది. ఈ నేపథ్యంలో రైతులు దుక్కులకు సిద్ధం చేశారు. కేదారిపురం వద్ద వరహాలగెడ్డలో నీరు పొంగి ప్రవహిస్తుండడంతో బ్రాహ్మణతర్లా, తదితర గ్రామాల పంటపొలాలకు ఉపయోగకరంగా ఉంటుందని ఆశాభావం రైతులు వ్యక్తం చేశారు.

●**పలాస:** భారీవర్షాలకు వైసీపీహయాంలో తాత్కాలికంగా వేసిన రోడ్లన్నీ గుంతలుగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాశీబుగ్గ- అక్కుపల్లి రహదారిపై వేసిన కంకర కరగడంతో రాకపోకలకు ద్విచక్రవాహ నచోదకులు ఇబ్బందిపడుతున్నారు.

●**నరసన్నపేట:** మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరదనీరు రైల్వే అండర్ పాసైజ్ వంతెనల్లో చేరడంతో పలు గ్రామాలు ప్రజలు ఇబ్బందిపడ్డారు.చిక్కాలవలస, బాడం వద్ద అండర్ పాసైజ్‌ల్లో నీరు చేరడంతోబాడాం, సుందరాపురం, చెన్నాపురం, కూర్మనాథపురం, గొటివాడ, తిమడాం తదితర గ్రామాలు నుంచి వచ్చే చోదకులు నీరు చూసి వెను తిరిగి పారశెల్లి మీదుగా నడగాం చేరుకొని అండర్ పాసైజ్‌లు క్రాస్ చేశారు. కాగా నరసన్నపేటలో భారీ వర్షం కురిసింది. తంపర భూముల్లో వరద నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


వజ్రపుకొత్తూరు: బెండిగేటు వద్ద రోడ్డుపై గోతుల్లో చేరిన నీరు

గొట్టా బ్యారేజీకి 3,353 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

హిరమండలం:గొట్టాబ్యారేజీ వద్ద వంశధార నీటి ప్రవాహం స్వల్పంగా పెరుగుతోంది.క్యాచ్‌మెంట్ ఏరియాలోని ఒడిశాలో 92.60 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. దీంతో 3,353 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో గొట్టాబ్యారేజీ వద్దకు వస్తోంది.బ్యారేజీ మూడుగేట్లు పైకెత్తి 1805 క్యూసెక్కుల నీటిని కిందకు విడిచిపెడుతున్నారు. కుడిప్రధాన కాలువ ద్వారా 440, ఎడమ కాలువ ద్వారా 1108 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు.

ఫీల్డ్‌అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరిస్తాం

పాతపట్నం: ఫీల్డ్‌అసిస్టెంట్లు సమస్యలు అధ్యయనం చేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. శుక్రవారం నిమ్మాడలోని క్యాంపుకార్యాలయంలో ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్ సంఘనాయకులు ఆయన్ను కలిశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు చింతాడ భైరాగినాయుడు, గున్న ధర్మారావు, శ్యాం, కళ్యాణ్ నీలకంఠం, శ్రీరాములు జగదీష్ పాల్గొన్నారు.

వ్యాధుల ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

మెళియాపుట్టి:వ్యాధులు ప్రబలకుండా చర్యతీసుకోవాలని ఎంఈవో మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం గొప్పిలి, గోకర్ణపురంల్లో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సుదర్శన, త్రయ్య పాల్గొన్నారు.

●**హిరమండలం:**వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని ఎంఈవో కె.రాంబాబు కోరారు. శుక్రవారం హిరమండలంలో కేజీబీవీని పరిశీలించారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

టెక్కలి: రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు అందజేయాలని రైతుసంఘం నాయకులు బగాది వాసుదేవరావు డిమాండ్ చేశారు. అయోధ్యపురం సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనం తరం సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం అందజేశారు.

టెక్కలిలో 108 వాహనం పరిశీలన

టెక్కలి: 108 వాహనాల పనితీరును శుక్రవారం టెక్కలి డివిజన్ పర్యవేక్షణాధికారి రాంప్రసాద్ పరిశీలించారు. వాహనంలో ఉన్న పరికరాలు, మందులు, రికార్డులను తనిఖీచేశారు. ఆయనతో పాటు 108 వాహన సిబ్బంది దేవాది శ్రీనివాసరావు, దుర్గారావు ఉన్నారు.

గోతులమయమైన రోడ్లు పరిశీలన

సంతబొమ్మాళి:మండలంలోని గోతులమయమైనఆర్‌అండ్‌బీ రోడ్లను కోటబొమ్మాళి జేఈ సరోజిని శుక్రవారం పరిశీలించారు.ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడు రహదారుల గోతులు పూడ్చాలని ఆదేశించిన విషయం విదితమే.దీంతో బోరుభద్ర-మేఘవరం రహదారిని ఆమె పరిశీలించారు.ఈరహదారిలో వెంటనే గోతులుపూడ్చాలని టీడీపీమత్స్యకార నాయకులు సూరాడ ధనరాజ్,ఎంపల్లి జోగారావు కోరారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

నరసన్నపేట: స్థానిక చిత్రివీధిలో ఎస్‌వీసీటీ సంస్థ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలను ఏడాదికి రూ.10వేలు విద్య, వైద్యకోసం వస్తు రూపం సహాయ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఈమేరకు స్కూల్ బ్యాగ్‌లు, న్యూట్రీషన్ పౌడర్, దుస్తులను 30 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టీ ఎన్ఆర్ఐ భమిడిపాటి అరుణశ్రీ పాల్గొన్నారు.

బాలికల హక్కులను పరిరక్షించాలి

నరసన్నపేట: బాలికల హక్కులను పరిరక్షించాలని ఐసీడీఎస్ పీవో నాగరాణి తెలిపారు.శుక్రవారం నరసన్నపేటలోఅంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణనిర్వహించారు.కార్యక్రమంలో ఎమ్పీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.

విధిగా హెల్మెట్‌ను ధరించాలి

పాతపట్నం:వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని జూనియర్ సివిల్‌న్యాయాధికారి తేజ చక్రవర్తి తెలిపారు.శుక్రవారం పాతపట్నంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం స్థానిక కోర్టు కూడలి నుంచి ఆలాంధ్రరోడ్ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ వినియోగం ఆవశ్యకతపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీఈ సత్యనారాయణ, న్యాయవాదులు గేదెల సూర్యం, ప్రకాశరావు, దాలయ్య, మద్దిల రమణ, సీహెచ్ రామకృష్ణ, మెట్ట అంజనేయులు, ఎస్.మధుబాబు పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు సహకరించాలి

పాతపట్నం:వ్యాధుల నియంత్రణకు ప్రజలు సహకరించాలి తెంబూరు సర్పంచ్ బి.వెంకటరమణ కోరారు. శుక్రవారం తెంబూరులో దోమల నియంత్రణ మందును పిచికారీ చేయించారు.

శాకంబరిగా దుర్గాగిరి అమ్మవారు

పోలాకి: దీర్ఘాశిలో కొలువుదీరిన దుర్గాగిరి అమ్మవారిని శుక్రవారం భక్తులు శాకంబరిగా పలురకాల కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రైతులు, మహిళలు ముగ్రాటలు, వడపప్పుతో అమ్మవారి మొక్కులు చెల్లించారు

జూనియర్ అసిస్టెంట్‌కు ఈవోగా బాధ్యతలు

పాతపట్నం:పాతపట్నం ఈవోగా పంచాయతీ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ దేసిల్లు దిలీప్‌కుమార్‌కు (ఎఫ్ఏసీ) అదనపు బాధ్యతలను అప్పగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దిలీప్‌కు మార్ ఈవోగా శుక్రవారం పదవీబాధ్యతలు చేపట్టారు.ఇప్పటివరకు ఈవోగా పనిచేస్తున్న కూర్మారావు దీర్ఘకాలంగా సెలవులో ఉండడంతో దిలీప్‌కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలను అధికారులు అప్పగించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నందిగాం: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో వాతావరణ కేంద్రం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సూచించడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వి.పద్మావతి, ఎంపీడీవో టి.రాజారావు ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లో అందుబాటులో ఉండి సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

లైంగిక వేధింపులపై అవగాహన

జలుమూరు: ఉద్యోగినులు లైంగిక వేధింపులకు గురైతే మండల టీముకు ఫిర్యాదు చేసి రక్షణ పొందవచ్చని ఇన్‌చార్జి ఎంపిడీవో పి.ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం జలుమూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో లైంగిక వేధింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో సారవకోట ఐసీడీఎస్ పీవో హెచ్.కామాక్షి, తహసీల్దార్ హెచ్.నాగమ్మ, ఎంఈవోలు బి.మాధవరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

ఎల్సీడీసీ సర్వేను పారదర్శకంగా చేపట్టాలి

జలుమూరు: గ్రామాల్లో ఇంటింటా చేపడుతున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెన్ (ఎల్సీడీసీ) సర్వేను పారదర్శకంగా చేపట్టాలని డీపీఎంవో వాన సురేష్‌కుమార్ తెలిపారు.శుక్రవారం మండలంలోని టెక్కలిపాడులో చేపడుతున్న ఎల్సీడిసి సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో స్వాతి, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, ఆశా అప్పలనర్సమ్మ పాల్గొన్నారు.

రెప్పపాటులో..

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- తొమ్మిది మందికి గాయాలు
- ఎమ్మెల్యే ఎన్ఈఆర్ సహకారంతో సహాయక చర్యలు
- జీజీహెచ్‌కు క్షతగాత్రుల తరలింపు


నుజునుజ్జయిన బస్సు ముందు భాగం


క్షతగాత్రులతో మాట్లాడుతున్న ఎన్ఈఆర్

లావేరు: అదపాక జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. శుక్రవారం విశాఖ నుంచి శ్రీకాకుళం ఆర్టీసీ బస్సు వస్తోంది. మరమ్మతుల కారణంగా అదపాక జంక్షన్ వద్ద ఆగి ఉన్న లారీని.. రెప్పపాటులో అదుపు తప్పి ఆ బస్సు ఢీకొంది. దీంతో ఆర్టీసీ డ్రైవర్ సీహెచ్ శ్రీనివాసరావు కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. లారీ కింద కూర్చొని మరమ్మతులు చేస్తున్న క్లీనర్ గౌతమ్‌కు కూడా తీవ్రగాయాలయ్యాయి. అలాగే ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న సూర్యప్రభాకర్, అనంతరావు, పి.వికాస్, బి.లక్ష్మీనారాయణ, ఈడ మల్లేష్, జె.రోహిణి, హేమసుందర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్ సహాయంతో శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్)కి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. లావేరు, ఎచ్చెర్ల ఎస్ఐలు స్వామినాయుడు, చిరంజీవి, లైన్స్‌క్లబ్ మెంబర్లు మోహన్‌రావు, బాడాన దేవభూషణ్‌తోపాటు స్థానిక యువత సహకారంతో క్షతగాత్రులను బయటకు తీసి సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు లావేరు ఎస్ఐ స్వామినాయుడు తెలిపారు.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య

గార: పెద్దతూలుగు గ్రామానికి చెందిన తాన్నే చిన్నారావు(56) అనే వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. చిన్నారావు మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య చిన్నమ్మడు నిలదీసింది. దీంతో మనస్తాపానికి గురైన చిన్నారావు గురువారం ఉదయం పురుగులు మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. చిన్నమ్మడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణ ప్రసాద్ తెలిపారు. చిన్నారావుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఇసుకలపేట డీలరు మృతి


వెంకటనారాయణ (ఫైల్)

ఆమదాలవలస: తొగరాం పంచాయతీ ఇసుకలపేట గ్రామ రేషన్ డిపో డీలరు గరుగుబిల్లి వెంకటనారాయణ (38) శుక్రవారం మృతి చెందారు. రెండు రోజుల కిందట జ్వరంతో బాధపడుతున్న ఆయన్ను శ్రీకాకుళంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందారు. వెంకటనారాయణకు భార్య శ్రీలక్ష్మి, కుమారుడు హరినారాయణ, కుమార్తె రిషిత ఉన్నారు.

జ్యూయలరీ షాపులో చోరీ

మందస: మందస మార్కెట్ జంక్షన్ మెయిన్‌రోడ్డులో ఆచార్య జ్యూయలరీ షాపులో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ ఘటన చోటు చేసుకుంది. మందస ఎస్ఐ అనిల్‌కుమార్ కథనం మేరకు.. శుక్రవారం ఉదయం యజమాని షాపును తెరవగానే చోరీ జరిగినట్టు గుర్తించారు. పూజకు ఉపయోగించే వెండి విగ్రహాలు, ముక్కుపుడకలు, పలు రకాల వెండి వస్తువులు కలిపి మొత్తం రూ.60 వేలు విలువ చేసే వెండి ఆభరణాలతో పాటు మూడు సీసీ కెమెరాలు కూడా అపహరించరించారు. ఎస్ఐ కేసు నమోదు చేశారు. కాగా మందస పట్టణంలో జరుగుతున్న దొంగతనాలను అరికట్టాలని ఎస్ఐకు వ్యాపారులు వినతిపత్రం అందజేశారు.

సమస్యలపై దృష్టి సారించండి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం: సమస్యలతో వచ్చే బాధితులతో పాటు సిబ్బంది సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావుకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. నగరంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంటే మరోవైపు ఎస్పీ పలు స్టేషన్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో స్థానిక టూటౌన్ పోలీసుస్టేషన్‌ను ఎస్పీ సందర్శించి ఎఫ్ఐఆర్ నమోదు, రాత్రి గస్తీ, డ్యూటీ రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా రౌడీషీటర్లు, సస్పెక్ట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే నగరంలోని దిశ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ సందర్శించి రికార్డులు, ఎఫ్ఐఆర్ నమోదు వివరాలను పరిశీలించారు. కేసుల వివరాలను దిశ డీఎస్పీని అడిగి తెలుసుకున్నారు.

మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించండి


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు

అరసవల్లి: కోటబొమ్మాళి మండలం, తాటిపర్తి గ్రామస్థులు నిత్యమూ వివిధ పనుల మీద నరసన్నపేట, శ్రీకాకుళం కార్యాలయాలకు, విద్యార్థులు స్కూల్స్, కళాశాలలకు వెళ్తుంటారు. గ్రామానికి బస్సు సర్వీసు లేనందున ఆటోలు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. అందువల్ల తమ గ్రామానికి బస్సు సర్వీస్ కల్పించాలని ఆ గ్రామస్థులు మంత్రి అచ్చెన్నాయుడుని కోరారు. ఈ మేరకు మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందించారు. కాగా తాటిపర్తి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

పోక్సో చట్టంపై అవగాహన

బూర్జ: పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పోక్సో యాక్ట్‌పై మహిళా ఉద్యోగులు సీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. మహిళా ఉద్యోగులు పనిచేసే చోట వేధింపులు, భద్రత తదితర అంశాలు వివరించారు. పోక్సో యాక్ట్ చట్టం గురించి వివరించి మండల స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు ఐసీడీఎస్ పీవో గీత తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ అంబేడ్కర్, ఏపీఎం, ఎంఈవో శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ శశిభూషణ్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ తొలగింపునకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శ్రీకాకుళం క్రైం: స్థానిక గుజరాతిపేటలోని రేషన్ డిపో (నెంబర్ 0181049)లో పనిచేస్తూ చేతివాటం చూపించిన ఎండీయూ ఆపరేటర్ నరేష్‌ను తొలగించేందుకు డీఆర్వో సీహెచ్ రంగయ్య ఉత్తర్వులు జారీ చేశారు. డిపోలోని 40 బస్తాల బియ్యం పక్కదారి పట్టించడంపై 'ఆంధ్రజ్యోతి'లో ఎండీయూ ఆపరేటర్ చేతివాటం శీర్షికతో గురువారం కథనం రావడంపై జేసీ నవీన్ స్పందించారు. శుక్రవారం డీఎస్‌వో శాంతిశ్రీతో జరిగిన ఘటనపై జేసీ చర్చించారు. దీనిపై నివేదిక అందించాలని సూచించారు. అలాగే ఎండీయూ ఆపరేటర్‌ను విధుల నుంచి తొలగించాలని జేసీ ఆదేశించడంతో ఆర్డీవో రంగయ్య ఉత్తర్వులు సిద్ధం చేశారు.

ఒళ్లు గుల్లవుతోంది!

- తీరని రహదారి కష్టాలు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు




బేసిరామచంద్రాపురం, బాతుపురం రహదారి దుస్థితి

సోంపేట: గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రహదారులన్నీ దారుణంగా తయారయ్యాయి. ముఖ్యంగా ప్రధాన రహదారులు కూడా గోతులమయంగా మారడంతో రాకపోకలకు ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకునేసరికి ఒళ్లంతా నొప్పులేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇదుగో నిధులు.. అదిగో పనులు అంటూ కాలయాపన చేసేశారే తప్పా.. రోడ్ల దుస్థితి మారలేదు. జాతీయ రహదారి నుంచి బేసిరామచంద్రాపురం మీదుగా బాతుపురం వరకు సుమారు 16కిలోమీటర్ల రహదారి పూర్తిగా పాడైంది. బాతుపురం నుంచి నిత్యమూ వందలాది వాహనాలు సోంపేట పట్టణానికి రాకపోకసాగిస్తుంటారు. ఇలాంటి రహదారి మొత్తం గోతులమయం అయినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో ఈ రహదారి కష్టాలకు మోక్షం కలుగుతుందని ఈ ప్రాంత వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కాగా ఈ రహదారి నిర్మాణానికి రూ.20లక్షతో ప్రతిపాదనలు పంపించినట్టు ఆర్అండ్‌బీ జేఈ మోహనరావు తెలిపారు.

అధ్వానంగా..

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాం గ్రామ ప్రవేశం నుంచి ప్రధాన రహదారి బజారువీధి గోతులమయం కావడంతో చిత్తడిగా మారింది. పేరుకే మండల కేంద్రం కాని మౌలిక వసతులు శూన్యం. ఏళ్ల తరబడి బజారు వీధి రహదారికి మోక్షం కలగలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మండల కేంద్రంలోని రహదారి దుస్థితి

చినుకుపడితే చిత్తడే!

కంచిలి: చినుకు పడితేచాలు మఠం సరియాపల్లి-దాళేశ్వరం వెళ్లే రోడ్డు చిత్తడిగా మారడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇదే రహదారిలో ఉన్న మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంచిలి మెయిన్‌రోడ్డు కూడా చిన్నపాటి వర్షానికి అధ్వానంగా తయారవుతుంది.


బురదమయంగా మఠం సరియాపల్లి రహదారి

రోడ్డుపైనే వర్షపునీరు

పొందూరు: మండల కేంద్రం రాపాక-పొందూరు రోడ్డు పక్కనున్న కాలువ ఆక్రమణలకు గురికావడంతో వర్షపునీరు రోడ్డుపైకి చేరుతోంది. గతంలో సుమారు 10అడుగుల కాలువ ఉండేది. కాలక్రమంలో దీన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో వర్షం కురిసిన ప్రతిసారి ఇలా రోడ్డుపైనే నీరు నిలిచిపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



చెరువులా పాఠశాల

పొందూరు: గత వైసీపీ ప్రభుత్వంలో విద్యకు ప్రాధాన్యతంటూ పాఠశాలల్లో ఆధునికీకరణ పనులకు కోట్లు రూపాయలు ఖర్చు చేశారు. అయినా చాలా గ్రామాల్లో పాఠశాలల పరిస్థితి అధ్వానంగానే ఉన్నాయి. తాడివలస పంచాయతీ లచ్చయ్యపేట గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితే ఇందుకు నిదర్శనం. చిన్నపాటి వర్షం కురిసినా పాఠశాల కారిపోయి చిత్తడిగా మారిపోతోంది. దీంతో విద్యార్థులు ఆ నీరు బయటకు తోడేందుకు అవస్థలు పడుతుంటారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాలలోకి నీరు చేరింది. దీంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. పాఠశాల దుస్థితి ఎంఈవోకు వివరించినట్టు ఉపాధ్యాయుడు తెలిపారు.




వర్షపు నీటిని తుడుస్తున్న విద్యార్థులు

ఉద్యోగులను ఎలా తొలగిస్తారు?

- ఎమ్మెల్యే బెందాళం అశోక్


వెండి కిరీటాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఇచ్ఛాపురం: ఉద్దానం ప్రాజెక్ట్‌లో కొంతమంది ఉద్యోగులను తొలగించి ఇష్టానుసారంగా కొత్తవారిని విధుల్లోకి తీసుకోవడమేంటూ అధికారులపై ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలో నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కేంద్ర మంత్రి రామ్మోహన్‌తో కలిసి ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. సకాలంలో జీతాలు లేకపోయినా.. 20 ఏళ్లుగా పనిచేస్తున్న వారిని ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పట్టణ పరిసర గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తే.. గత రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను పక్కదారి పట్టించిందని ఎమ్మెల్యే ఆరోపించారు. దీంతో ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. 'మునిసిపాలిటీలో 1,2,3 వార్డులకు తాగునీరు అందటం లేదు. పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించాలి. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలి. సురంగిరాజా మైదానంలో ఇండోర్ స్టేడియం పనులు పూర్తి చేయాల'ని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇచ్ఛాపురం మునిసిపాలిటీలో పలు సమస్యలను పరిష్కరించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు మంత్రి రామ్మోహన్‌ను కోరారు. 'పురుషోత్తపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు కొరత భర్తీ చేయాలి. 1,2,3 వార్డుల ప్రజల సమస్యలను పరిష్కరించాలి. కొండపోలమ్మ కాలనీలో రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి కృషి చేయాలి. శిథిలావస్థలో ఉన్న మార్కెట్‌ను పునర్నిర్మించాలి' అని రాజు కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో భరత్‌నాయక్, మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్, పీఆర్ ఎస్ఈ ఎంవీ శేఖర్, డీఈ రామకృష్ణ, ఈఈ సూర్యప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జాన్‌బెన్హర్, పబ్లిక్ హెల్త్ ఈఈ సుగుణాకరరావు, ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్‌రావు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి ఘనస్వాగతం

సోంపేట: కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఇచ్ఛాపురం నియోజకవర్గానికి తొలిసారిగా వచ్చిన కింజరాపు రామ్మోహన్‌కి కొర్లాం జంక్షన్‌లో టీడీపీ నాయకులు శుక్రవారం ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆధ్వర్యంలో మహిళలు తిలకం దిద్దారు. అక్కడి నుంచి ఇచ్ఛాపురం చేరుకున్నారు.

- **ఇచ్ఛాపురం:** కేంద్రమంత్రి రామ్మోహన్‌ను, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను పట్టణ టీడీపీ నాయకులు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. వెండి కిరాటాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కాళ్ల దర్మారావు, సాలిన డిల్లీ, నందికి జాని, వెంకటలక్ష్మి, కాళ్ల దిలీప్, పత్రి తవిటయ్య, ఆశి లీలారాణి, కొరాయి ధర్మరాజు, డిల్లీరావు, సహదేవ్, పద్మనాభం, జిలానీ తదితరులు పాల్గొన్నారు. అలాగే అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆ యూనియన్ నాయకురాలు హైమావతి కేంద్రమంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు.

నదులు అనుసంధానం చేయాలని..

కంచిలి: నదులు అనుసంధానం ఇచ్ఛాపురం వరకు కొనసాగించాలని నియోజకవర్గ రైతు సంఘ ప్రతినిధులు ప్రధాన శివాజీ, మాదిన రామారావు, చిత్రాడ శ్రీనివాసరావు, పండిదేవేంద్ర, పిలక చినబాబురెడ్డి కోరారు. ఈమేరకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్, ఎమ్మెల్యే బెందాలం అశోక్‌ను శుక్రవారం ఇచ్ఛాపురంలో కలసి వినతి పత్రం అందించారు.

చేనేత కార్మికులకు అండగా నిలవాలి


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: ఖాదీ వస్త్రాలను అందరూ ధరించి చేనేత కార్మికులకు అండగా నిలుద్దామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. నగరంలోని ఇలిసిపురంలోని గ్రామ స్వరాజ్య సంఘం ఖాదీ ధామ్ ఆవరణలో ఆధునీకరించిన ఖాదీ గ్రామోద్యోగ బాండర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక వస్త్ర ప్రపంచంతో పోటీ పడుతూ ఖాదీ పరిశ్రమ మనుడగ సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ డైరెక్టర్ ఎస్.గ్రీప్, అసిస్టెంట్ డైరెక్టర్ షేక్ మహమ్మద్ నాస్, గ్రామ స్వరాజ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

25లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని 4,6 సెమిస్టర్ పరీక్షల ఫీజును ఈ నెల 25వ తేదీలోగా చెల్లించాలని డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థులు 30న హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. నాలుగో సెమిస్టర్ థియరీ పరీక్షలు ఈ నెల 31 నుంచి, ఆరో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 1వ తేదీ నుంచి జరుగుతాయన్నారు. ఒక్కో సెమిస్టర్‌లో అన్ని సబ్జెక్ట్‌లకు కలిపి రూ.1,050 చెల్లించాలన్నారు.

బాధ్యతగా సామాజిక తనిఖీలు చేపట్టాలి

సరుబుజ్జిలి: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన నిధుల చెల్లింపుపై నిర్వహించే సామాజిక తనిఖీ బాధ్యతగా నిర్వహించాలని డ్వామా ఏపీడీ పంచాది రాధ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో సామాజిక తనిఖీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. 2023-24 సంవత్సరంలో మండలంలో రూ.14.93 కోట్లు ఉపాధి హామీ ద్వారా చెల్లింపులు నిర్వహించినట్టు ఏపీవో పార్వతి తెలిపారు. ఏపీడీ రాధ మాట్లాడుతూ.. 2007 సంవత్సరంలో ప్రారంభమైన ఉపాధి పనుల్లో భాగంగా ప్రస్తుతం 17వ విడత సామాజిక తనిఖీ చేపట్టామన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ చింతాడ మణికుమార్, విజిలెన్స్ ఏపీవో అరుణ్‌కుమార్, ఎంపీటీసీలు శివ్వాల సూర్యనారాయణ, సురవరపు సింహాచలం, సర్పంచ్ కృష్ణ పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూడాలి

ఆమదాలవలస: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. శుక్రవారం కొర్లకోట పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి సాగర్ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. క్లస్టర్ కోఆర్డినేటర్ రమణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించండి

కంచిలి: రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం బూరగాం గ్రామ సచివాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి చెందిన రైతు సంఘ నాయకులు కప్ప గోపీనాథ్, జనార్దన్, మన్మథరావు, లచ్చయ్య తదితరులు వినతి పత్రాన్ని అందజేశారు. రైతులకు పెట్టుబడి సాయం అందించాలన్నారు. కౌలు రైతులను గుర్తింపు కార్డులు అందించాలని, రైతు కూలీలకు ఉపాధి పథకం ద్వారా పనులు కల్పించాలన్నారు.

మంత్రి అచ్చెన్నను కలిసిన కలమట


అచ్చెన్నాయుడితో మాజీ ఎమ్మెల్యే కలమట

అరసవల్లి: రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ శుక్రవారం నిమ్మాడలో గల మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

కూరగాయల సాగుతో లాభాలు

ఇచ్ఛాపురం: ప్రకృతి వ్యవసాయం ద్వారా పీఎండీఎస్ పెరట తోటల పంట పొలాల్లో కూరగాయల సాగుతో అధిక లాభాలు పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి పీఎంఎస్ రేవతి అన్నారు. శుక్రవారం మండలంలో గల మశాఖపురం గ్రామంలో నవధాన్యాలు ద్వారా పండించే పంటలను పరిశీలించారు. ఏటీఎం మోడల్ కూరగాయలు పెంపకం వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం హెచ్ఆర్ శ్రీనివాసరావు, ఎంటీ సూర్యనారాయణ, నాగమణి పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి


వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

రణస్థలం: యునైటెడ్ బేవరీస్ పరిశ్రమ నుంచి అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మినాయుడు, యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గంగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం రణస్థలంలోని ఎంపీ కార్యాలయంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుని కలిసి వినతి పత్రం అంద చేశారు. 18 ఏళ్ల నుంచి క్రమశిక్షణతో పనిచేస్తున్న జె.గంగరాజు, పి.సత్యనారాయణ, జి.శంకర్, ఎండ తవుడు, కె.గొల్ల బాబులను ఈనెల 15న ఎటువంటి ముందస్తు నోటీసులు జారీ చేయకుండానే నిలిపివేయడం సరికాదని మండిపడ్డారు. ఈ విషయంలో ఎంపీ కలగజేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

రైలు నిలుపుదలకు చర్యలు తీసుకోవాలి

జి.సిగడాం: స్థానిక రైల్వే స్టేషన్‌లో విశాఖ - బ్రహ్మపూర్ రైలు నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు భూపతి అర్జున్‌కుమార్ శుక్రవారం విజయనగరం పార్లమెంటరీ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడును కోరారు. ఈ మేరకు శుక్రవారం రణస్థలంలోని ఎంపీ నివాసం వద్ద కలిసి వినతి పత్రం అందించారు. అలాగే మూడు, నాలుగు ప్లాట్‌ఫాం నుంచి దక్షిణ వైపు ప్రయాణీకులు వెళ్లేందుకు ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. నాయకులు మీసాల రామకృష్ణ, పెదద్ది రామరాజు తదితరులు ఉన్నారు.

పున్నపురెడ్డిని పరామర్శించిన తమ్మినేని

సరుబుజ్జిలి: మర్రిపాడుకు చెందిన వైసీపీ నాయకులు పున్నపురెడ్డి తవిటినాయుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం శుక్రవారం సాయంత్రం తవిటినాయుడును పరామర్శించారు. జడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ శివానంద బాబు, బీసీ సెల్ డైరెక్టర్ ముడడ్ల రమణ, ఎడ్ల ఈశ్వరరావు, కొవిలాపు చంద్రశేఖర్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల దత్తతకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్: బాలల రక్షిత గృహాల్లో (అనాధ ఆశ్రమాలు) ఉంటున్న పిల్లల దత్తతకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారి బి.శాంతిశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత ఉన్నవారు ఫోస్టర్ కేర్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పిల్లలను రెండేళ్ల పాటు సంరక్షణ చేసిన అనంతరం పెంపుడు తల్లిదండ్రులకు చట్టప్రకారం దత్తత తీసుకోవచ్చని తెలిపారు. తల్లిదండ్రుల వయస్సు 35 సంవత్సరాలు దాటి ఉండాలని, 6 నుంచి 12, 12 నుంచి 18 ఏళ్ల వయస్సు గల పిల్లలను తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు జిల్లా బాలల రక్షణాధికారి ఫోన్ నెంబరు 94400 34476 లేకుంటే స్థానిక 80 అడుగుల రోడ్డు, వాంబే కాలనీ వద్ద గల తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పొందూరు ఖాదీపై పోటీలు

పొందూరు: ప్రపంచ ప్రఖ్యాత పొందూరు ఖాదీ వస్త్రాలకు మరింత ప్రాచుర్యం కలిగించేందకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా పొందూరు ఖాదీ ప్రక్రియ విశిష్టతపై వీడియో పోటీలు నిర్వహించేందుకు నిర్ణయించింది. ఈ ఏడాది ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ పోటీలను రాష్ట్ర చేనేత జౌళ్లశాఖ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు సిద్ధమైంది. ఖాదీ వస్త్రాలపై తీసిన వీడియోలను మంగళగిరిలోని రాష్ట్ర చేనేత జౌళ్లశాఖ కార్యాలయానికి ఆగస్టు 1వ తేదీలోగా పంపించాలని అధికారులు తెలిపారు. పోటీలో విజేతలకు నగదు బహుమతితోపాటు ప్రశంసా పత్రాన్ని అందించనున్నారు.

వార్షిక సర్వేకు జిల్లాలోని 62 పరిశ్రమల ఎంపిక

అరసవల్లి: స్థూల జాతీయోత్పత్తి లెక్కింపులకు వార్షిక పరిశ్రమ సర్వే 2022-23 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 62 పరిశ్రమలు ఎంపికయ్యాయి. ఇందులో టెక్కలి రెవెన్యూ డివిజన్‌కి సంబంధించి 15 పరిశ్రమల స్థితిగతులను, ఆర్థికపరమైన లావాదేవీలు, పనిచేస్తున్న కార్మికుల వివరాలు తదితర గణాంకాలను సేకరించారు. కోటబొమ్మాళి మండలంలోని వెంకట సీతారత్నం మోడరన్ రైస్‌మిల్లు, నిమ్మాడ వద్ద గల మమతా గ్రానైట్స్, చిన్నబమ్మిడి వద్ద జెనిత్ గ్రానైట్స్‌ను జిల్లా గణాంక కార్యాలయం నుంచి వచ్చిన కె.మురళీకృష్ణ, జిల్లా గణాంకాధికారి, ఉప గణాంకాధికారి దసూళ్ల సురేంద్ర, తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ టెక్కలి డిప్యూటీ ఎస్‌వో నందా, ఏఎస్‌వో సూర్యనారాయణ, కోటబొమ్మాళి తహసీల్దారు, స్థానిక వీఆర్వోలు, పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

25 శాతం ఉపసంహరణకు అవకాశం

అరసవల్లి: సీపీఎస్ ఉద్యోగులు తమ ఖాతాల్లో జమ అయిన కాంట్రిబ్యూషన్ నుంచి 25 శాతం మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవడానికి ఎన్ఎస్‌డీఎల్ అవకాశం కల్పించింది. అవసరం ఉన్న ఉద్యోగులు తమ వ్యక్తిగత ప్రాన్ ఖాతాలో లాగిన్ అయి పాక్షిక ఉపసంహరణ చేసుకోవచ్చు. అలాగే గతంలో విత్‌డ్రా చేసుకొన్న వారు ఆ ఉపసంహరణ తేదీ నుంచి ఇప్పటివరకు తమ ఖాతాలో జమ అయిన మొత్తం నుంచి మళ్లీ 25 శాతాన్ని విత్‌డ్రా చేసుకోవచ్చు. ఉద్యోగి తన సర్వీసులో మూడుసార్లు మాత్రమే ఇలా చేసుకోవచ్చని సీపీఎస్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురుగుబెల్లి. భాస్కరరావు, చల్లా దుర్గాప్రసాద్ తెలిపారు.

సబ్సిడీపై టమాటా

ఆమదాలవస: సబ్సిడీపై రైతు బజార్ ద్వారా కిలో టమాటా రూ.65కే విక్రయిస్తున్నట్టు మార్కెటింగ్ శాఖ కార్యదర్శి డి.జయ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రైతు బజార్‌లో టమాటా విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.100 టమాటా పలుకుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్ ద్వారా సబ్సిడీపై తక్కువ ధరకు టమాటా విక్రయిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ కె.చిన్నప్పమ్మ, సెక్యూరిటీ గార్డులు జి.శ్యామలరావు, మురళీధర్, వాచ్‌మన్ అంబటి శైలజ ఉన్నారు.

25న నీలమ్మతల్లి పండగ

శ్రీకాకుళం కల్చరల్: పెద్దబరాటం వీధిలో ఉన్న నీలమ్మ తల్లి పండగ ఈ నెల 25న ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు బరాటం సాయిరాజ్ తెలిపారు. 108 కళాశాలతో ముర్రాటలు, నీలమ్మ తల్లికి అలంకరణ, వివిధ కళారూపాలుతో ఊరేగింపు నిర్వహించనున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

అందుబాటులో ఉండాలి

గార: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మండలంలో అధికారులంతా అందుబాటు ఉంటూ ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో జూమ్ ద్వారా మాట్లాడారు. సముద్ర తీర ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీను, ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.